క్లుప్తంగా

లోక్ కల్యాణ మేళా

పిడుగురాళ్ల: లోక్ కల్యాణ మేళా గాంధీనగర్‌లోని మెప్మా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా), పురపాలక సంఘం ఆధ్వర్యంలో చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీధి విక్రయదారులకు, కుటుంబ సభ్యుల కొరకు ప్రత్యేక ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించటం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



పిడుగురాళ్ల: పట్టణంలోని ఎల్ఐసీ కృష్ణారావు బజార్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో స్వస్థ నారీ సశక్తి పరివార్ వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 364 పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు పి.అనిల్‌కుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వం మహిళల ఆరోగ్య సంరక్షణలో భాగంగా రాష్ట్రం వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులలో స్వస్థనారి స్వశక్తి పరివార్ కార్యక్రమాన్ని ద్వారా వైద్య పరీక్షలు నర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ముఖ్యమంగా మహిళల్లో నోటి, రొమ్ము, గర్భాశయ తదితర క్యాన్సర్‌కి సంబంధించి వైద్య పరీక్షలు చేసి వాటిపై అవగాహన కల్పించటం జరిగిందన్నారు.

పోషకాహారం ఆరోగ్యానికి రక్ష



పిడుగురాళ్లరూరల్: పోషకాహారం ఆరోగ్య వంతమైన జీవితానికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఐసీడీఎస్ సీడీపీవో పి.రాజేశ్వరి అన్నారు. మండలంలోని పెద అగ్రహారంలో అంగన్‌వాడీ కేంద్రంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గర్భంలోని శిశువు ఎదుగుల నుంచి శిశువు జన్మించే వరకు, పెరుగుతున్న పిల్లలకు పోషకాహారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులలో పోషకాహర లోపాన్ని నివారించేందుకు పోషణ మాసం నిర్వహించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అంజలికుమారి పాల్గొన్నారు.

బాలకృష్ణ దిగజారుడు వ్యాఖ్యలు



గురజాల: నందమూరి బాలకృష్ణ అసెంబ్లీలో మాట్లాడిన మాటలు ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సిద్దాడపు గాంధి పేర్కొన్నారు. ఆయన తన కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ ఐదేళ్ల సీఎంగా ఉండి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రజలకు అందించారని చెప్పారు. గతంలో బాలకృష్ణ మెంటల్ సర్టిఫికేట్ పొందిన విషయాన్ని గుర్తు చేశారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని సైకో అని వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం



బెల్లంకొండ: పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత దూరమవుతుందని చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి దీపిక తెలిపారు. శుక్రవారం మండలంలోని మాచాయపాలెంలో స్వస్థనారి- సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 90 మంది మహిళలకు వైద్య పరీక్ష నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్ కుమార్, సీహెచ్‌ఓ మణికుమారి, ఎంఎల్‌హెచ్‌పీ విజయశాంతి, ఏఎన్ఎం వాణి, సిబ్బంది పాల్గొన్నారు.

వాగొస్తే రాకపోకలు బంద్

- లో లెవల్ చప్టాలపై చేరిన నీరు
- అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



మాచర్ల- జమ్మలమడక రహదారి లో లెవల్ చప్టాపై ప్రవహిస్తున్న వర్షం నీరు



మాచర్ల- లింగాపురం గ్రామ రహదారి లో లెవల్ చప్టా పై ప్రవహిస్తున్న చంద్రవంక నీరు



కొత్త పాలువాయి, పాత పాలువాయి గ్రామాల మధ్య ప్రమాదభరితంగా ప్రవహిస్తున్న పిల్లి వాగు



పాత పాలువాయి గ్రామంలో కాలువను తలపిస్తున్న ప్రధాన రహదారి

మాచర్ల రూరల్: వర్షాకాలం వచ్చిందంటే ఆ గ్రామ ప్రజల రాకపోకలపై అప్రమత్తంగా ఉండాలి. ఏ క్షణంలో వాగులు వస్తాయో.. చప్టాలు పొంగి తమకు ఇబ్బందులు కలిగిస్తాయోనని బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు కొనసాగించాల్సిన పరిస్థితి. మాచర్ల నుంచి జమ్మలమడక, లింగాపురం, తుమకోట గ్రామాలకు వెళ్లే చంద్రవంక వాగు లో లెవల్ చప్టాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి చినుకులు పడి పైన ఉన్న వాగులు నుంచి చంద్రవంక వాగు పొంగి లో లెవల్ చప్టాలపై ప్రమాదకర పరిస్థితిలో నీరు ప్రవహిస్తుంటాయి. అత్యవసర పనులలో వైద్యశాలకు వెళ్లాలన్నా, ఏ చిన్న పనిమీద సమీపంలో మాచర్ల పట్టణానికి వెళ్లాలంటే ఈ రహదారిలోనే ప్రయాణించాలి. పట్టణానికి లింగాపురం గ్రామ సమీపంలోని బొంబాయి కంపెనీ కుడికాలువ వద్ద నూతనంగా నిర్మిస్తున్న హైవే రహదారి బ్రిడ్జి నిర్మాణం వలన కూడా ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగం లేక పోగా మరింత ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ లో లెవల్ చప్టా బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జిలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్త బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలి..



మా గ్రామానికి వర్షం వస్తే రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. మాచర్ల పట్టణం వద్ద చంద్రవంక వాగు, బొంబాయి కంపెనీ వద్ద వాగులను దాటుకుంటూ ఊరిలోకి రావాలన్నా, పోవాలన్నా వ్యయ ప్రయాసాలకోర్చి ప్రయాణం సాగిస్తున్నాం. బొంబాయి కంపెనీ, మాచర్ల చంద్రవంక వద్ద బ్రిడ్జిల నిర్మాణం చేపడితేనే మా గ్రామాల రాకపోకలకు సాధ్యం.

– తరిపి శ్రీనివాసరావు, లింగాపురం మాజీ సర్పంచి

మహాలక్ష్మిగా భ్రమరాంబికాదేవి అమ్మవారు



సత్రశాలలో మహాలక్ష్మీ అలంకారంలో భ్రమరాంబికాదేవి అమ్మవారు



రెంటచింతల వాసవీ అమ్మవారి ఆలయంలో ధనలక్ష్మీగా..



పాలువాయి జంక్షన్‌లోని కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో ధనలక్ష్మిగా..



రెంటచింతలలోని గుంటక కాశిరెడ్డి వీధిలో ధనలక్ష్మీగా..



దాచేపల్లిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద లక్ష్మీదేవీ అలంకరణలో అమ్మవారు



చెన్నాయపాలెంలో మహాలక్ష్మీదేవిగా రేణుకా అమ్మవారు



పిడుగురాళ్ల పట్టణంలోని బ్రహ్మంగారి గుడిలో ధనలక్ష్మీగా అమ్మవారు



పాలువాయి జంక్షన్‌లోని కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు



కొత్తపల్లిలో పూజలు నిర్వహిస్తున్న ఎంపీపీ సుజాత తదితరులు

రెంటచింతల: శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని సత్రశాల వద్ద ఉన్న గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో భ్రమరాంబిక అమ్మవారు మహాలక్ష్మి దర్శనం ఇచ్చారు. స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం, గంగమ్మ ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమించారు. పాలువాయి జంక్షన్ వద్ద త్రిశక్తిపీఠంగా విరాజిల్లుతున్న కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో దుర్గాదేవి అమ్మవారు ధనలక్ష్మిగా, లక్ష్మీదేవి రాజ్యలక్ష్మిగా, సరస్వతీదేవి కామాక్షిగా భక్తులకు దర్శనమిచ్చారు. పాలువాయి జంక్షన్‌లోని కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో రాష్ట్ర శిల్పకళా అండ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ చైర్‌పర్సన్ చేరెడ్డి మంజుల ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు మహాన్నదానం చేపట్టారు. సత్రశాల దేవస్థానం, వాసవి అమ్మవారి దేవస్థానం అధ్యక్షులు కట్టమూరి వెంకట నాగేశ్వర రావు, కనకదుర్గ అమ్మవారి దేవస్థానం అధ్యక్షులు యేచూరి సాంబశివరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లక్ష్మీదేవిగా అమ్మవారు..

దాచేపల్లి: స్థానిక వీర్ల అంకమ్మతల్లి, వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవారి దేవాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. స్థానిక లైబ్రరీ సెంటర్ సమీపంలో వైఎస్సార్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారిని కరెన్సీతో లక్ష్మీదేవిగా అలంకరణ చేశారు. 150 మంది భక్తులతో కుంకుమ పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారి ప్రసాదాలను భక్తులకు అందజేశారు. విద్యుత్ దీపాలతో మండపాన్ని అలంకరించారు.



పిడుగురాళ్ల వెంకటేశ్వర స్వామి దేవాలయంలో రూ.5 లక్షలలో ధనలక్ష్మీగా అలంకరణ

వైభవంగా సంతానలక్ష్మి దర్శనం

మాచర్ల రూరల్: దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకొని మండలంలోని కొత్తపల్లి లోని దేవాలయాలలో శుక్రవారం సంతానలక్ష్మి అవతారంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సుజాత, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతురెడ్డి కోటిరెడ్డి దంపతులు పూజల్లో పాల్గొన్నారు.

మహాలక్ష్మీదేవిగా అమ్మవారు..

మాచవరం: మండలంలోని చెన్నాయపాలెంలో రేణుకా అమ్మవారు మహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారి జానపాటి సీతారామ శర్మ ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మాచవరం శివాలయంలోని భ్రమరాంబిక అమ్మవారు ధనలక్ష్మీ గాను, వాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గాయత్రి దేవి గానూ భక్తులకు దర్శనమిచ్చారు.

ధనలక్ష్మీగా అమ్మవారులు...

పిడుగురాళ్ల: పట్టణంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా గంగమ్మ తల్లి దేవాలయంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించి అమ్మవారిని ధనలక్ష్మీగా అలంకరించారు. జానపాడు రోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని రూ.2 లక్షలతో ధనలక్ష్మీగా అలంకరించారు. సత్యసాయి దేవాలయంలో అమ్మవారిని నెమలి పించలతో ప్రత్యేకంగా అలంకరించారు. బ్రహ్మంగారి దేవాలయం, కనక దుర్గమ్మ దేవాలయంలో అమ్మవారిని ధనలక్ష్మీగా అలంకరించారు. తహసీల్దార్ కార్యాలయంలో వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అమ్మవారిని రూ.5 లక్షలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.



పిడుగురాళ్ల.. ధనలక్ష్మీగా గంగమ్మ తల్లి



పిడుగురాళ్ల.. మహాలక్ష్మీ అవతారంలో కనక దుర్గమ్మ



పిడుగురాళ్ల పట్టణంలోని ధనలక్ష్మీగా వాసవీ అమ్మవారు



నెమలి పించాలతో ప్రత్యేక అలంకరణలో సత్యసాయి దేవస్థానంలోని అమ్మవారు

వీరతెలంగాణ యోధురాలు ఐలమ్మకు నివాళి



పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులోని చిట్యాల ఐలమ్మ విగ్రహం వద్ద జయంతి శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శెట్టుపల్లి పూర్ణ అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ... రజకులకు ఎన్నికల సమయంలో ఎస్సీ జాబితాలో చేర్చుతామని చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. 18 రాష్ట్రాల్లో ఎస్సీ జాబితాలో ఉన్నారని, 8 రాష్ట్రాల్లో బీసీ- ఏలో ఉన్నారని చెప్పారు. చాకలి అంటే జైలుకు పంపిస్తానని, ప్రజా చైతన్య యాత్రలో భాగంగా నారా లోకేష్ ఇచ్చిన హామీ రక్షణ చట్టంగా చట్టం రూపొందిస్తామని ఇంత వరకు చర్యలు లేవని గుర్తు చేశారు. రజకుల వృత్తిదారులకు 50 సంవత్సరాలకే పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రజక సంఘ నాయకులు భీమవరపు కోటేశ్వరరావు, కంభంపాటి పెద్ద వెంకటేశ్వర్లు, పట్టు సిరి చిన్న శంకర్, అంకారావు, సుబ్బారావు, మైలవరపు అశోక్, కంభంపాటి సూర్య, మురికిపూడి నాగరాజు, రావులపల్లి చిరంజీవి, గుత్తికొండ కోటేశ్వరరావు, గుర్రపుశాల బాలకృష్ణ, నాగరాజు, కె. ముక్కంటి, ఎస్. పేరయ్య, ఎస్. అనిల్, పి. అమరలింగయ్య, పసుమర్తి గురుమూర్తి పాల్గొన్నారు.

హెచ్ఐవీ నివారణపై అవగాహన

దొడ్లేరు(క్రోసూరు): హెచ్ఐవీ నివారణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ అన్నారు. శుక్రవారం దొడ్లేరులో ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం సహకారంతో స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన మొబైల్ వాహనం ప్రొజెక్టర్ ద్వారా హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాంసన్ మాట్లాడుతూ హెచ్ఐవీ వ్యాప్తి చెందే పద్ధతి, నివారణ చర్యలను వివరించారు. కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భూలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త అనుపమ, టీబీ సూపర్‌వైజర్ సౌజన్య, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు ఎల్.నాగలక్ష్మి, కె.ఈశ్వర్, ఎం.జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

సత్తెనపల్లి: పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ నంబూరి ఆనంద్ కుమార్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛతా హి సేవలో భాగంగా స్వచ్ఛ ఉత్సవ్ -2025లో శుక్రవారం అచ్చంపేటరోడ్డులో చెత్త, వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. రోడ్లపై చెత్త వేయొద్దని, పరిసరాలను మనమే శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.విజయసారథి, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, శానిటరీ మేస్త్రీలు, పారిశుద్ధ్య కార్మికులు, తదితరులు ఉన్నారు.

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదలలో స్వచ్ఛతాహీ సేవ అవగాహన ర్యాలీ శుక్రవారం జరిగింది. అక్టోబర్ 2 వరకు అన్ని గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని ఎంపీడీవో పి.రత్నం తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివాజీ, ఏపీఓ ఏడుకొండలు, ఎంఆర్‌సీ బ్రహ్మానందం, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి డాక్టరేట్ ప్రదానం

బొల్లాపల్లి: ఉపాధ్యాయుడిగా రాణిస్తూనే ఓ వ్యక్తి డాక్టరేట్ పొందారు. మండలంలోని వెల్లటూరు జెడ్పీ హైస్కూల్లో లెక్కల ఉపాధ్యాయుడైన ఏకేవీ ప్రకాష్ క్రిస్టియన్ బైబిల్ పఠనం ద్వారా హైదరాబాద్‌కు చెందిన షెపర్డ్ థియోలాజికల్ సెమినరి సంస్థ ద్వారా డాక్టరేట్ పొందారు. ఇటీవల డాక్టరేట్ పట్టాను ఆ సంస్థ నిర్వాహకుల నుంచి అందుకున్నారు. ప్రకాష్ ఆధ్యాత్మికత వైపు మరింత స్థాయికి ఎదగాలని పాఠశాల హెచ్ఎం బ్యూలా హోసన్న, చంద్రజిత్ యాదవ్ తదితరులు అభినందించారు.



పిడుగురాళ్ల పట్టణంలోని జానపాడు రోడ్‌లో ఉన్న వాసవీ అమ్మవారి దేవాలయానికి విద్యుత్ కాంతులు



పిడుగురాళ్ల అడితీల సెంటర్ నందు విద్యుత్ అలంకరణలో కనక దుర్గమ్మ

విద్యుత్ కాంతులతో దేవాలయాలు

దేవిశరన్నవరాత్రుల సందర్భంగా పట్టణంలోని పలు దేవాలయాలు విద్యుత్ కాంతులతో విరాజిల్లుతున్నాయి. పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం, కనక దుర్గమ్మ దేవాలయం, గంగమ్మ గుడి, వెంకటేశ్వరస్వామి దేవాలయం, లింగేశ్వర స్వామి దేవాలయం, నాగుల గుడి ,శివాలయం, బ్రహ్మంగారి దేవాలయం, సాయిబాబా మందిరం ఇలా పట్టణంలోని అన్ని దేవాలయాలు విద్యుత్ దీపాలతో భక్తులకు ఆకర్షణీయంగా అలంకరించారు.

– పిడుగురాళ్ల